

వాణిశ్రీ

ముసురు పట్టి మూడు రోజులైంది.

కొండల్లాంటి మబ్బులు సూర్యుడ్ని బంధించి వేశాయి.

ఆకాశం ఏడుస్తూ వున్నట్లు వర్షం పడుతోంది.

రైల్వే స్టేషన్ ఫిష్ మార్కెట్‌లా తడితడిగా, కంపుకంపుగా చీదరగొడ్తూ వుంది.

గోపాలరావు అర్జెంట్‌గా మద్రాస్ వెళ్ళాల్సొచ్చింది. బెర్త్ కోసం ప్రయత్నిస్తే దొరకలేదు. రిజర్వేషన్ లేకుండా అంతదూరం జనరల్ కంపార్ట్‌మెంట్‌లో అదీ రాత్రంతా ప్రయాణం చెయ్యడం కష్టమైన పనే. కాని తప్పదు.

రాత్రి తొమ్మిది కావొచ్చింది.

సర్కార్ ఎక్స్‌ప్రెస్ అరగంట ఆలస్యంగా వచ్చింది. రద్దీ లేదు. జనరల్ కంపార్ట్‌మెంట్స్ ఖాళీగానే వున్నాయి.

'హమ్మయ్య' అనుకున్నాడు కూర్చోడానికి చోటు సంపాదించుకుని. ముసురు పట్టి బండి ఖాళీగా వుందిగాని లేకపోతే నిలబడడానికి కూడా ఖాళీ దొరకదు.

గోపాలరావు పక్కసీట్లో ఒక యువతి కూర్చుంది. ఆమె కూడా గుంటూర్లోనే ఎక్కింది. బండి కదలకముందే సినిమా వీక్లీలోకి తలదూర్చి పరిసరాలను మర్చి పోయింది.

ఆమె అప్పుడే విచ్చిన ఎర్రగులాబీ పువ్వులా పరిమళాన్ని వెదజల్లుతోంది. కళ్ళు నక్షత్రాల్లా ధగధగలాడుతున్నాయి. ఆమె చెక్కిళ్ళు అంగలకుదురు లేత తమలపాకుల్లా నిగనిగలాడుతున్నాయి.

ఆమె ఆ కంపార్ట్‌మెంట్‌లో, మురికి వెరువు మధ్య వాలిన హంసలా ప్రత్యే కంగా కనిపిస్తోంది.

ఒంటరి ప్రయాణంలా వుంది. ఆమె పక్కన ఎంౖబాయిదరీ చేసిన గుడ్డసంచి మాత్రమే వుంది. బహుశా తెనాలిలోనో, బాపట్లలోనో దిగిపోతుందేమో, తను వదుకోవచ్చని తలచి "ఎక్కడికమ్మా ప్రయాణం?" అని అడిగాడు గోపాలరావు.

"మద్రాస్ వరకూనండీ" అని విన యంగా సమాధానం చెప్పి మళ్ళీ వెంటనే పత్రికలోకి తల దూర్చేసింది మరొక ప్రశ్న అడగడానికి ఛాన్స్ ఇవ్వకుండా.

ఎదురు సీట్లో పేపరు చదువుకుంటున్న యువకుడిని, అతని పక్కనే కూర్చున్న ఇద్దరు నడివయసు ఆడవాళ్ళని కూడా అడిగాడు. అంతా "మద్రాస్" అని చెప్పడంతో నిరాశ కలిగింది. తెల్లవారే వరకూ కునికిపాట్లు తప్పవు అను కున్నాడు.

రైలు క్రూరంగా అరిచి బయల్దేరింది.

తెనాలి దాటిన తర్వాత ఆ అమ్మాయి వీక్లీ సంచిలోకి నెట్టి లావుపాటి తెలుగు నవలొకటి తీసి చదవడం ప్రారంభిం చింది. మద్రాస్ వచ్చేవరకూ అలా చదువుతూనే వుంటుంది కాబోలు అని అబ్బురపడ్డాడు గోపాలరావు.

కొంత సేపటికి ఆ నవల పేజీల మధ్య నుంచి ఒక కవరు జారి సీటుకింద పడింది. ఆ అమ్మాయి ఆ విషయం గమనించలేదు.

గోపాలరావుకి కుతూహలం కలిగింది. ఆ అమ్మాయి ఎవరై వుంటుంది? మద్రాస్ ఎందుకు వెళ్తోంది? వెంట పెద్దవాళ్ళెవరూ లేకుండా ఎందుకు బయల్దేరింది?

తన సందేహాలన్నింటికీ ఆ కవరు సమాధానం చెప్పగలదనిపించింది ఎందుకో! ఆ కవరు తీసి చదవాలి ఎలా? వంగి తీస్తే? ఆమె చూస్తే? అని సంశ యిస్తూ వుండగా ఆమె లేచి బాత్‌రూమ్‌కి వెళ్ళింది. ఇదే అదనుగా ఆతను వంగి ఆ కవరు తీసుకుని కోటు జేబులో దాచాడు. తను ఏదో సాహసకార్యం చేస్తున్నంత థ్రిల్ కలిగింది.

ఆమె తిరిగివచ్చిన తర్వాత గోపాల రావు లేచి టాయిలెట్‌కి వెళ్ళి లోపల బోల్టువేసి కోటు జేబులోనుంచి కవరు తీశాడు. పైన అడ్రస్ చదివాడు. కుమారి కె. సుజాత, బి.ఏ. ఫైనల్ అని ఆమె చదువుతున్న కాలేజి అడ్రస్ వుంది.

కవరు లోపలనుంచి కాగితం తీసి మడతలు విప్పాడు. అదొక సినిమా కంపెనీ లెటర్ హెడ్. జగన్మోహినీ ఆర్ట్ పిక్చర్స్, టి. నగర్, మద్రాస్ అని వుంది.

డియర్ సుజాత!

కంగ్రాట్స్! ఎందుకంటే నువ్వు మా నెక్స్ట్ పిక్చర్‌లో హీరోయిన్‌గా సెలక్ట్ అయ్యావు. డైరెక్టర్ రావుగారు నీ ఫొటోలు చూసి చాలా మెచ్చుకున్నారు. అచ్చం సావిత్రిలా ఉందని ప్రొడ్యూసర్ గారు అన్నారు. నువ్వు నటించబోయే మొదటి పిక్చర్ హీరో బాబుగారు. అంతా నీ గుడ్ లక్. నువ్వు ఫీల్డులోకి దిగి ఫస్ట్ పిక్చర్ రిలీజ్ అయితే ఇక సుహాసినీ, విజయశాంతి వగైరాలంతా ఫేడౌట్ అయ్యారన్నమాటే.

ఫైనల్‌గా నీకు మేకప్ టెస్ట్, వాయిస్, స్క్రీన్ టెస్ట్‌లు వగైరా చేయాలి. ఓ.కే. అవగానే అగ్రిమెంట్ చేయించి అడ్వాన్స్ ఇస్తారు. ప్రొడ్యూసర్‌గారు పిలిపించమని చెప్పారు. ఒక నెల లోపల స్టోరీ ఫైనల్ కాబోతూ వుంది.

అంతా నీ అదృష్టం. కాకపోతే ఔట్ డోర్ షూటింగ్‌లో మన పరిచయం జరగడం, వుత్తరాలు రాసుకోవడం, పరిచయం స్నేహంగా మారడం నీకు సినిమా హీరోయిన్ అయ్యే ఛాన్స్ రావడం అంతా గమ్మత్తుగా లేదూ!

ఫస్ట్ తారీఖున రాత్రి బయల్దేరు. సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఉదయం ఆరుగంటలకు మద్రాస్ చేరుతుంది. నేను హిగ్గిన్ బాదమ్స్ దగ్గర వేయిట్ చేస్తూ వుంటాను.


నీకు రావడానికి వీలుపడకపోతే వెంటనే టెలిగ్రామ్ ఇవ్వు. మరొక విషయం. వచ్చేటప్పుడు నీవెంట ఎవర్నీ తీసుకురావద్దు. ఇక్కడ తోడు నేను వున్నాను గదా!

ఇట్లు
నీ ప్రియమైన మిత్రుడు
ఎ.బి.సి.డి. రాజా.
అసిస్టెంట్ డైరెక్టర్.

చదవడం పూర్తయ్యాక లెటర్ మడతపెట్టి కవర్లోకి నెట్టి దాన్ని జేబులో వడేసి వెళ్ళి సీట్లో కూర్చున్నాడు.

సుజాత నవలని శ్రద్ధగా పఠిస్తోంది. అమాయకమైన ఆమె వదనాన్ని చూసే కొద్దీ గోపాలరావుకి బాధ కలిగింది. అతనికి సినిమాఫీల్డు గురించి కొంత తెలుసు. అమాయకురాళ్ళయిన సుజాత లాంటి యువతులెందరో వేషాల మోజులో ఇళ్ళల్లోంచి పారిపోయి మద్రాస్ చేరి భ్రష్టులైపోయారు. శీలం పోగొట్టుకుని వేశ్యలుగా మారి జీవచ్ఛవాల్లా కాలంగడిపేవాళ్ళు లెక్కలేదు. కొందరు ఆ జీవితం గడపలేక, ఇటు ఇంటికి రాలేక ఆత్మహత్యలు చేసుకుంటారు.

అసిస్టెంటు డైరెక్టర్‌కు ప్రముఖ




హీరో సరసన హీరోయిన్‌గా ఛాన్స్ ఇప్పించేటంత పలుకుబడి వుంటుందా? తెలియనివాళ్ళు భ్రమపడొచ్చు. ఎ.బి.సి.డి. రాజనేవాడు మోసగాడని తెలుస్తూనే వుంది నిజంగా అటువంటి అవకాశమే వుంటే ఆ అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడి వాళ్ళు ఇష్టపడిన తర్వాత ఛాన్స్ ఇప్పించవచ్చు. కాని అతగాడు వెంట ఎవర్నీ తీసుకురావద్దు! ఇక్కడ తోడు నేనున్నాగా అని రాశాడంటే అర్థం ఏమిటి? ఆమెను మోసం చెయ్యాలనే ప్రయత్నమేగా?

'ఈ అమ్మాయి దీపం పురుగులా ఆహుతి కావడానికి వెళ్తోంది' అనే భావం కలిగినప్పుడు గోపాలరావుకి జాలి కలిగింది. ఆమె జీవితం తెగిన గాలిపటంలా గాలిలో కొట్టుకుపోయి తునాతునకలై పోతుందేమో పాపం!

సినిమా రంగంలో జరిగే మోసాలు, కుళ్ళు, కుతంత్రాలు చెప్పి ఆమెను వెళ్ళతుండా ఆపితే? కాని ఆమె వింటుందా? హీరోయిన్ ఛాన్స్ వచ్చిందని కలలు కంటున్న ఆమె చెవికెక్కుతుందా? చెవిటివాడి ముందు శంఖం వూదినట్లు వృధా!

గోపాలరావు మనసులో ఆలోచనలు తేనెతుట్టెలో ఈగల్లా చెలరేగుతున్నాయి.

ఎదురుసీట్లో కూర్చున్న కుర్రవాడిని అడిగి పేపరు తీసుకున్నాడు. హెడ్డింగ్‌లు చూస్తూవుంటే 'మద్రాస్ బీచ్‌లో యువతి శవం!' అనే హెడ్డింగ్ కనబడింది.

"చూశారా ఎంత ఘోరమో! మద్రాస్ బీచ్‌లో యువతి ఆత్మహత్య. పాపం ఆ అమ్మాయికి ఇరవై ఏళ్ళు కూడా లేవట!" అని సానుభూతి చూపించాడు గోపాలరావు.

పేపరు ఇచ్చిన కుర్రాడు ఆ వార్త తనూ చదివానన్నట్లు తల వూపాడు.

"ఆ అమ్మాయి ఎవరోగాని పాపం సినిమాల్లో వేషాలకోసం వెళ్ళి, మోస

పోయి వుంటుంది. ఇంటికి రావడానికి ముఖంచెల్లక సముద్రంలో పడి ప్రాణం తీసుకుని వుంటుంది" అన్నాడు గోపాల రావు.

నవలలోని అక్షరాల వెంట రేస్ గుర్రాల్లా పరుగెత్తుతున్న ఆమె కళ్ళు కళ్ళెం వేసినట్లు ఆగిపోయాయి. తలెత్తి చూసింది.

"పేపర్లో అలా రాయలేదే?"

"రాయలేదనుకోండి! మద్రాస్ బీచ్‌లో చాలావరకు ఇటువంటివి మామూలే! ఏంచేస్తాం? ఇక్కడ్నుంచి వెళ్ళే అమ్మాయిలకు బుద్ధివుంటే గదా! అదేం సినిమా మోజో మరి, పరాసరి హీరోయిన్ అయిపోవాలని పరుగెత్తు తారు. మరీ ఘోరం ఏమిటంటే కని పెంచిన తల్లిదండ్రులకి చెప్పకుండా పోవడం! అక్కడ ఏ బ్రోకరుగాడి చేతిలోనో మోసపోయి ప్రాణాలు తీసు కోవడం! ఏం చెప్పాలి బాబూ! అంతా కర్మ. నేనే మోసపోయాను ఇంత వయసొచ్చి!"

"ఏమిటీ! మీరుగూడా సినిమా వేషాల కోసం వెళ్ళారా?" ఆ యువకుడు నవ్వుతూ అడిగాడు.

"నాది ఆ కేసు కాదు. నా కూతుర్ని ఒక పత్రికలో సబ్‌ఎడిటర్‌గా పని చేస్తున్నవాడి కిచ్చాను. పెళ్లయి సంవ త్సరం గడిచిందో లేదో నా అల్లుడు సబ్‌ఎడిటర్ ఉద్యోగం మానేసి సిని మాల్లో చేరిపోయాడు. అసిస్టెంట్ డైరె క్టర్‌గా. కర్మ కాకపోతే మరేమిటి? అక్కడ ఏం సంపాదన ఉంటుంది? ఒక పిక్చర్‌కి పనిచేస్తే మళ్ళీ వెంటనే పిక్చర్ దొరుకుతుందని గ్యారంటీ లేదు. ఒక్కో సారి సంవత్సరానికి గూడా దొరకదు. ఇల్లు గడవక పెళ్ళాన్ని పుట్టింటికి పంపే శాడు రాస్కెల్."

"మీ అల్లుడు పేరేమిటండీ?"

"ఆ వెధవ పేరు ఎ.బి.సి.డి. రాజు."

ఆ పేరు వింటూనే సుజాత ఉలిక్కి పడింది. ఆమె చేతిలోని నవల జారి పడింది. ఆమె తల తిరిగి కళ్ళముందు చీకట్లు వ్యాపించాయి. అంత చలిలోను ఆమెకు చెమట్లు పట్టాయి.

"అమ్మాయీ! కవరేదో పడినట్లుంది నీదేనా?" అన్నాడు గోపాలరావు.

"ఆఁ - అవునండీ నాదే!" అని సీటు కింద వున్న కవరు తీసుకుని పుస్తకంలో పెట్టింది.

ఎర్రగులాబీ పువ్వువంటి ఆమె ముఖం తెల్లబడిపోయింది. ఇప్పుడామె కళ్ళల్లో ఇందాకటి కాంతి లేదు.

అతను ఆశించిన చలనం ఆమెలో కలగడం సంతృప్తిని కలిగించింది. ఆమె పసిపిల్ల కాదు. బి.ఏ. చదువుతున్న యువతి. అందమైన కోనేట్లోని కలువ పూలు కోసుకోవాలని దిగబోయే ముందు అందులో ఎన్ని మొసళ్ళు, జలగలు, విషప్పురుగులున్నాయో చెప్తే తెలుసుకో

గల జ్ఞానం వున్న అమ్మాయి. చెప్పినా వినకపోయిందా అది ఆమె కర్మ!

గోపాలరావు మళ్ళీ మొదలుపెట్టాడు.

"నా అల్లుడు కాబట్టి చెప్పకూడదు! అయినా నిజం నిప్పులాంటిది. దాచినా దాగదన్నారు. నేను దాచినా లోకానికి తెలియదా! ఆ రాజాగాడెంత మోసగాడో మాటల్లో చెప్పలేను. సబ్ఎడిటర్‌గా వున్నప్పుడు ఫరవాలేదు. ఆ సినిమాగాలి సోకింది వెధవై పోయాడు. ఎర్రగా బుర్రగా ఆడపిల్ల కనబడితే చాలు ఎర వేయడం! అదీ ఎట్లా? సినిమాల్లో హీరోయిన్ వేషాలు ఇప్పిస్తానని! దారుణమైన మనిషిలెండి. ప్రొడ్యూసర్లకి, డైరెక్టర్లకి తార్చడమే ఆ బ్రోకర్‌గాడి పని. వాళ్ళకి లొంగకపోతే హీరోయిన్ చాన్సు రాదని బెదిరించడం, పైగా చివరకు తిండికోసం ఎక్స్‌ట్రా వేషాలు వెయ్యాల్సి వస్తుంది. పాపం ఆ అమ్మాయిలు రెంటికీ చెడతారు. అభిమానం వున్నవాళ్ళు సముద్రంలో దూకక ఏం చేస్తారు?"

గోపాలరావు చెప్పడం ఆపి సుజాతను గమనించాడు. ఆ అమ్మాయి కళ్ళు పుస్తకంలోకి చూస్తున్నాయిగాని చదవలేకపోతోంది.

ఆమె మనసులో తుఫాన్ చెలరేగి అల్లకల్లోలంగా ఆలోచనలు తిరుగుతున్నాయి.

"ఈ మధ్య వాడొక అమ్మాయిని వ్యభిచార గృహానికి అమ్ముతుంటే పోలీసులు పట్టుకుని చావగొట్టారు. ఆ కేసులో మంచివాడిని బైటపడేసేసరికి నా తల ప్రాణం తోకలోకి వచ్చింది. బోలెడంత డబ్బు క్షవరమైంది. అమ్మమ్మ! పగవాడికి కూడా వాడిలాంటి నికృష్టుడు అల్లుడిగా దొరకకూడదు. కాని అంతా కర్మ. అనుకున్నది జరుగదు. అనుకోనిది జరుగుతుంది అదే జీవితం అంటే."

"అందుకే అల్లుడ్ని దశమ గ్రహం అన్నారు" అని నవ్వాడు ఆ కుర్రవాడు.


"బాగా చెప్పావు నాయనా!" అని నవ్వి "మళ్ళీ ఏదైనా వుద్యోగంలో పెట్టాలని ప్రయత్నం చేస్తున్నాను. పెళ్ళి చేసి కూతుర్ని ఎన్నాళ్ళని ఇంట్లో పెట్టుకోను. నలుగురూ నవ్వుతున్నారు. నా కూతుర్ని మొగుడు వదిలేశాడని పుకారొకటి."

"మీ అల్లుడి అసలు పేరేమిటి? ఎ.బి. సి.డి. రాజా ఏమిటండీ?"

"వాడి బొంద. అదేమిటో డిగ్రీలాగా!" అన్నాడు. తర్వాత ఆ రాజాగాడంత తాగుబోతు, తిరుగుబోతు, పరమ నీచుడు ప్రపంచంలోనే వుండడని తిట్టాడు. తిట్టీ తిట్టీ అలిసిపోయాడు.

రాత్రి పన్నెండు గంటలు దాటింది. ఒంగోలు స్టేషన్ వచ్చింది.

సుజాత నవల మూసి సంచిలో సర్దుకుని లేచింది. ఆమె ముఖంలో భయం లేదిప్పుడు. స్థిరత్వం, దృఢత్వం కనిపించాయి. ఒక సుడిగుండంలో పడబోయి



తప్పించుకున్నాన్న ఆనందంతో బయల్దేరింది. వెళ్ళేముందు గోపాలరావు వైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసింది.

గోపాలరావుకి సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. ఆమెలో ఇంత త్వరగా చైతన్యం కలుగుతుందనీ, మధ్యలోనే తోక ముడుస్తుందనీ వూహించలేదు.

రైలు కూత పెట్టింది. బండి కదుల్తూ వుండగా సుజాత కిటికీలో నుంచి తల లోపలికి పెట్టి "చాలా థాంక్స్ మాష్టారూ" అంది.

మబ్బుల చెరనుంచి విడిన చంద మామలా వెలుగులు విరజిమ్ముతోంది ఆమె ముఖం.

గోపాలరావు చిద్విలాసంగా చిరునవ్వు నవ్వాడు. గోమాతలా చల్లగా చూశాడు.

ఆమె ఆయనకు "థాంక్స్" ఎందుకు చెప్పిందో అక్కడున్న వారెవరికీ అర్థం కాలేదు.